# శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి

మహారాష్ట్ర దేశంలోని మాణ్గావ్‌లో ఒక శిష్టాచార సంపన్నులైన బ్రాహ్మణ గృహంలో జన్మించాడు వాసుదేవశాస్త్రి. అతడి తండ్రి గణేశభట్టు. 'శ్రీగురుచరిత్ర' నిత్యము పారాయణ చేసేవాడు. వాసుదేవ శ్సాస్త్రి తన ఏడవ ఏట ఉపనయనమైనప్పటి నుండి గాయత్రీ మంత్ర జపము, వేద పారాయణ, నిత్యాగ్నిహోత్రము నియమంగా చేస్తూండేవాడు. కేవలం వంశాచారంగా మాత్రమే 'శ్రీగురుచరిత్ర' గూడా నిత్యమూ కొంతసేపు పారాయణ చేసేవాడు. అయినప్పటికీ అతనికి పూర్ణ దత్తానుగ్రహం లభించింది. ప్రక్కనుండి దత్తస్వామి అతనిని అడుగడుగునా నడిపించారు. అతడొక అడవిలో పులిని చూచి భయపడినపుడు ఒక ఆజానుబాహువైన మానవాకారంలో దర్శనమిచ్చి అతనిని రక్షించారు. తర్వాత ఆ విషయం ఆయనే చెప్పారు. మరొకసారి అతనికి స్వప్న దర్శనమిచ్చి, ''నీవు నరసోబావాడి వెళ్ళు. నీకు తల్లి అనుమతి, ప్రయాణానికి పైకము మనిషితోడు దొరుకుతాయి" అని చెప్పారు. అలానే తల్లి అనుమతించింది. ఒక వ్యక్తి వచ్చి రూ. 250/-లు ఇచ్చాడు. అంతలో ఒక దత్త భక్తుడొచ్చి అతనిని తనతో గూడ నరసోబావాడి రమ్మన్నాడు. వారిద్దరూ బయల్దేరి బోడేగాం అనే గ్రామం చేరారు. నాటి రాత్రి స్వప్నంలో దత్తస్వామి కన్పించి, "నీవు నరసోబావాడిలో గోవిందస్వామిని దర్శించు!" అన్నారు. చిత్రం! వారిద్దరూ నరసోబావాడీ చేరగానే ఆ గోవిందస్వామియనే యతివరుడొచ్చి, అతనిని ఆప్యాయంగా పేరుపెట్టి పలకరించారు! తర్వాత ఆ క్షేత్రంలో 'శ్రీగురుచరిత్ర' ఒక సప్తాహ పారాయణ చేయమని దత్తస్వామి అతని నాదేశించారు. అతడు తనవద్ద ఆ గ్రంథం లేదని చెప్పగా, "మీరజ్‌లో శంకరభట్టువద్ద ఆ గ్రంథమున్నది. తీసుకో!" అని దత్తస్వామి చెప్పారు. అతడు మీరజ్ వెళ్ళిఅడిగితే అది నిత్య పారాయణ గ్రంథమనీ, దానినింకొకరికివ్వననీ భట్ చెప్పాడు. కాని నాటి రాత్రి స్వప్నంలో దత్తస్వామి అతనినాదేశించడం వలన మరునాడు ఈ గ్రంథం వాసుదేవశాస్త్రికిచ్చాడు భట్. ఒకనాటి సాయంత్రం ఆరతి, పూజ అయ్యాక వాసుదేవశాస్త్రి కృష్ణానదిలో కాళ్ళు, చేతులు కడుక్కుని వస్తున్నాడు. పాదుకా మందిరం వద్ద తేజోమూర్తియైన ఒక సన్యాసి ఎదురై సూర్యాస్తమయం తర్వాత ఆ నదిలో కాళ్ళు కడుక్కోగూడదని చెప్పి మందలించారు. శాస్త్రి క్షమాపణ కోరాడు. తర్వాత శ్రీ గోవిందస్వామి ఎదురై,''నిన్ను మందలించినవారు శ్రీ నృసింహసరస్వతీ స్వామీ, నీవు గుర్తించావా?" అన్నారు! మరొకసారి పంచాయతన పూజ శ్రీ కైశ్వర్‌బువా అనే సాధువు నుండి నేర్చుకొమ్మని శాస్త్రిని ఆదేశించారు దత్తస్వామి.



ఇంతకాలమూ వాసుదేవశాస్త్రి శ్రీ దత్తస్వామిని ప్రత్యేకంగా ఆరాధించ లేదు. "శ్రీగురుచరిత్ర" పారాయణ తన ప్రధాన సాధనగా చేయనూలేదు. తర్వాత అతడు మళ్ళీ నరసోబావాడి వెళ్ళినపుడు శ్రీ గురుణ్ణి ప్రధానంగా పూజించమని శ్రీ గోవిందస్వామి చెప్పారుగాని అతడంగీకరించలేదు. నాటి రాత్రి స్వప్నంలో దత్తస్వామి అతనికి మంత్రోపదేశం చేశారు. తెల్లవారగానే గోవిందస్వామి ఎదురై రాత్రి అతనికైన ఉపదేశం గురించి ప్రస్తావించి, ఆ మంత్రానుష్టానము, విధానము తెల్పారు. శ్రీ గోవిందస్వామికి, దత్తస్వామికి భేదంలేదని తెలిసి ఆయననే గురువుగా స్వీకరించారు వాసుదేవశాస్త్రి.

గురువాజ్ఞననుసరించి నిర్దుష్టమైన గృహస్థజీవితం గడిపారు శాస్త్రి. దత్తస్వామి ఆజ్ఞననుసరించి 7 సం..లు వుండి మాణ్గావ్‌లో దత్తమందిరం నిర్మించాడు. ఆ కాలంలోనే అతడు "శ్రీగురుచరిత్ర" మొదలైన గ్రంథాలెన్నో సంస్కృతంలో వ్రాసాడు. వాసుదేవుని ఆదేశాన్ననుసరించి ''శ్రీగురుచరిత్ర'' పారాయణచేసి ఎందరో తమ బాధలు నివారించుకున్నారు.

సం.. 1889లో వాసుదేవశాస్త్రి నరసోబావాడి వెళ్ళారు. ఒకరోజు గోవిందస్వామి, "రేపు నేను శరీరత్యాగం చేస్తాను" అని చెప్పి, మరురోజే మహాసమాధి చెందారు. వారి దేహాన్ని మౌనస్వామి కృష్ణలో విడిచిపెట్టి, తర్వాతి క్రతువు వాసుదేవశాస్త్రిచేత జరిపించారు. వాసుదేవశాస్త్రి నరసోబావాడిలో వుండగా ఒకసారి అతని భార్య సమీపంలోని కోల్హాపూర్‌లో విజయంచేస్తున్న శ్రీకుంభారస్వామి అనే మహాత్ముని దర్శించాలనుకున్నది. నాటి రాత్రి శాస్త్రికి స్వప్నంలో, " నీవు రేపు ఉత్తరదిశగా వెళ్ళు" అని దత్తస్వామి ఆదేశించారు. మరరోజే ఆ దంపతులిద్దరూ కోల్హాపూర్ చేరుకున్నారు. కొద్దినిమిషాలలో పిచ్చివానిలా అచటి వీధులలో సంచరిస్తున్న కుంభారస్వామి వారి చెంతకు పరుగున వచ్చారు. అపుడు వాసుదేవశాస్త్రి భార్య అన్నపూర్ణబాయి చేతిలోని పాత్రలో వున్న మంచినీళ్లు త్రాగేసి ఆయన వెళ్ళిపోయారు. ఆ మహాత్ముని